
సాక్షి
ములుగు
శనివారం | 9 | డిసెంబర్ | 2023



సమస్యలు పరిష్కరించాలి
కేయూలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కేయూ అధ్యక్షుడు ఆచార్య ఈసం నారాయణ డిమాండ్ చేశారు. - 8లో▸



స్పాన్సర్ కోటాకు నోటిఫికేషన్
కేయూలో ఎంఎల్ఐఎస్సీ, ఎమ్మెస్సీ బాటనీ, ఐదేళ్ల ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ కోర్సుల్లో స్పాన్సర్ కోటా సీట్లలో భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు.- 8లో▸

గరిష్టం/కనిష్టం
29° /17°

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రి వేళ చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



మంగపేట: మండలంలోని బోరు నర్సాపురం వాడగూడెం, రాజుపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ శుక్రవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు ఎలా ఉన్నాయి, టార్పాలిన్లు సరిపడ ఉన్నాయా లేవా అని ఆయా కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్రాహ్మణపల్లి పంచాయతి పరిధిలోని బండారిగూడెం ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు వర్షాలకు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి అరవింద్ రెడ్డి, డీఎం రాములు, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, రైతులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ములుగు రూరల్: విద్యార్థులు అగ్నివీర్, అగ్నిపథ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బండారుపల్లి , ఇంచర్ల గురుకుల పాఠశాలలు, కేజీబీవీ ములుగు పాఠశాలల్లో కళాశాల విద్యార్థులతో సీనియర్ నాన్ కమిషనర్ ఆఫీసర్ రాజేష్, మిశ్రా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్‌కు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో జాయిన్ కావాలని సూచించారు. యువత త్వరగా జీవితంలో స్థిరపడాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కుమారస్వామి, విద్యాశాఖ కోఆర్డినేటర్లు రాజు, సాంబయ్య, విక్రం రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నతిని పకడ్బందీగా అమలు చేయాలి



ములుగు రూరల్: గురుకుల పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని గురుకులాల రాష్ట్ర సెక్రటరీ రమణకుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బండారుపల్లి గురుకుల పాఠశాల, జవహర్‌నగర్ పాఠశాలలను ఆర్జేడీ సత్యనారాయణరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, ఆవరణను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చేపడుతున్న బోధన విధానాన్ని పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నతి సోపానాలను అనుసరించాలన్నారు. ఉపాధ్యాయులు బోధనలో టీఎల్ఎం, సాంకేతిక పరికరాలు, ఐఎఫ్‌పీ పానల్స్ వినియోగించి కృత్యంధార బోధదన చేసే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని మల్లంపల్లి ఏఈ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు పరిధిలోని 33/11 కేవీ ములుగు, పత్తిపల్లి, కాశిందేవిపేట, వెలుతుర్లపల్లి, లక్ష్మీదేవిపేట, మల్లంపల్లి, అబ్బాపూర్, పందికుంట, నర్సాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం, మంత్రులకు శుభాకాంక్షలు

భూపాలపల్లి రూరల్: ప్రమాణస్వీకారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్కకు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి కుమార్, కోశాధికారి దశరథ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం తీరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రభుత్వ పథకాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.

సమయం ఆసన్నమైంది

- జాతరకు 73 రోజులే మిలిగింది
- అధికారులకు సవాల్‌గా మారిన మేడారం
- నిధుల మంజూరు కోసం ఎదురుచూపులు
- ఈసారి భక్తులకు తిప్పలు తప్పేనా..



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు 73 రోజులే గడువు మిలిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు మహాజాతర జరుగనుంది. మేడారం జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న అభివృద్ధి పనుల కోసం శాఖల వారీగా కావాల్సిన నిధుల మంజూరు కోసం అధికారులు అప్పటి జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కృష్ణ ఆదిత్య అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి నిధుల మంజూరుకు ప్రతిపాదలను సమర్పించినా.. నిధులు మంజూరు కాలేదు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు రావడంతో జాతర నిధుల కేటాయింపు పక్కన పడింది. ఎన్నికలు ముగిసి అధికారంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జాతరలో భక్తుల సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లా నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సీతక్క మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జాతర సమయం ఆసన్నం కావడంతో జాతరలో భక్తుల సౌకర్యాలు పెద్ద సవాల్‌గా మారింది. నూతన ప్రభుత్వం త్వరగా జాతరకు నిధులు మంజూరు చేస్తే అభివృద్ధి పనులు ముందుకు సాగే ఆస్కారం ఉందని భక్తులు, పూజారులు అభిప్రాయపడుతున్నారు.

అధికారులకు సవాల్

మేడారం జాతర ఈసారి అధికారులకు సవాల్‌గా మారింది. ఇన్ని రోజులు ఎన్నికల కోడ్ సందర్భంగా నిధులు మంజూరు చేయకపోవడంతో జాతర పనులు మొదలు కాలేదు. నూతన ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరు చేస్తే పనులు ముందుకు సాగుతాయని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. తక్కువ రోజుల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన కుస్తీ పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సంక్రాంతి పండుగ ముందు నుంచే అమ్మవార్లను దర్శించుకుంటారు. ఈసారి జాతరకు సుమారుగా కోటి మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. జాతర దగ్గర పడుతున్నా.. పనులు మొదలు కాకపోవడంతో భక్తులకు జాతరలో ఇబ్బందులు తప్పేలా లేదు.

ప్రతీ జాతరలో తిప్పలే..

ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే మహాజాతరలో అరకొర సౌకర్యాలతో భక్తులకు తిప్పలు తప్పడం లేదు. ప్రతి జాతరలో అనేక పరిణామాలతో హడావుడి పనులు చేపట్టడంతో భక్తులకు అరకొర సౌకర్యాలు మిగులుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి ఎన్నికల నేపథ్యంలో నిధుల మంజూరులో ఆలస్యం కావడం ఈసారి జాతర పనులు కూడా హడావుడిగానే సాగనున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రతి జాతరకు రూ.లక్షలాది నిధులు కేటాయిస్తున్నా.. జాతర అభివృద్ధి మొదటికి వస్తుంది. సీతక్క మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి నూతన ప్రభుత్వంలో మంత్రిగా అవకాశం దక్కింది. జాతరపై మంత్రి సీతక్కకు చాలా అనుభవం ఉంది. ప్రభుత్వం నుంచి జాతర నిధులు మంజూరుకు, జాతర ఏర్పాట్ల పనులకు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

..అనే నేను

నేడు కొత్త ఎమ్మెల్యేల ప్రమాణం

- ఉమ్మడి వరంగల్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్ నుంచి ఇద్దరు మంత్రులు సహా 10 మంది.. బీఆర్ఎస్ నుంచి ఇద్దరు
- తొలిసారిగా అసెంబ్లీలోకి ఏడుగురు..



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు శనివారం నుంచి జరగనున్నాయి. మూడు లేదా నాలుగు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉమ్మడి వరంగల్ నుంచి మొత్తం 12 మంది శాసనసభ్యులు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క సహా ఉమ్మడి వరంగల్ నుంచి ఎన్నికైన 10మంది ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. అదే విధంగా బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీలుగా ఉండి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ప్రమాణం చేయనున్నారు. కాగా.. ఈ ఎన్నికల్లో గెలుపొందిన ఏడుగురు ఎమ్మెల్యేలు మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ధనసరి సీతక్క (ములుగు), కొండా సురేఖ (వరంగల్ తూర్పు), గండ్ర సత్యనారాయణరావు (జయశంకర్ భూపాలపల్లి), నాయిని రాజేందర్‌రెడ్డి (వరంగల్ పశ్చిమ), రేవూరి ప్రకాశ్‌రెడ్డి (పరకాల), దొంతి మాధవరెడ్డి (నర్సంపేట), డాక్టర్ మురళీ నాయక్ (మహబూబాబాద్), డాక్టర్ రామచంద్రు నాయక్ (డోర్నకల్), మామిడాల యశస్వినిరెడ్డి (పాలకుర్తి), కేఆర్ నాగరాజు (వర్ధన్నపేట) గెలుపొందారు. బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ) విజయం సాధించారు.

కొత్తగా ఏడుగురు...
మొదటిసారిగా ముగ్గురు మహిళలు..

ఉమ్మడి జిల్లా నుంచి ఈ ఎన్నికల్లో మొదటిసారిగా ఏడుగురు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ముగ్గురు మహిళా ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించనున్నారు. మొదటిసారి అసెంబ్లీకి వెళ్లే అవకాశం దక్కిన వారిలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, రామచంద్రునాయక్, మామిడాల యశస్విని రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు ఉన్నారు. ఎమ్మెల్సీగా శాసన మండలిలో ప్రాతినిథ్యం వహించి.. జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా వెళ్లడం తొలిసారే. మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క సహా ఎమ్మెల్యేలు యశస్వినిరెడ్డి మహిళా ప్రజాప్రతినిధులుగా జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

చట్టం ముందు అందరూ సమానులే..

- సీనియర్ సివిల్ జడ్జి మాధవి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవి

గోవిందరావుపేట: మనుషులందరికీ పుట్టుకతోనే స్వేచ్ఛ సమానత్వం, గౌరవ హక్కుల విషయంలో అందరూ సమానులేనని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి టి.మాధవి అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో చల్వాయిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, కాలేజీలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి.మాదవి హాజరై మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ, హక్కుల అణచివేత లేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం సాగాల్సిన కృషికి గుర్తుగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తారన్నారు. జీవించే హక్కు, స్వేచ్ఛ హక్కు, స్వీయ భద్రత హక్కు, భావ ప్రకటన హక్కు ప్రతి మనిషికి ఉంటాయని, చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. ఈ కార్యక్రమంలో మేకల మహేందర్, డి.సంజీవ్, ఎండీ నిజాముద్దీన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి అర్బన్: మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జయరాం రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని సన్‌వాలీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయరాంరెడ్డి హాజరై మాట్లాడారు. మానవ హక్కుల ఉల్లంఘన చేయవద్దన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహం చేయవద్దని చెప్పారు. విద్యార్థులు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఎవరికి ఆపద వచ్చినా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏదులాపురం శ్రీనివాస్, న్యాయవాది కాళిదాసు, పాఠశాల డైరెక్టర్లు సతీష్, సురేష్, అకాడమిక్ ఇన్‌చార్జ్ అంజిరెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రామ్మూర్తి

ఏటూరునాగారం: ఏటూరునాగారం పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సర్పంచ్ ఈసం రామ్మూర్తి ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వార్డు సభ్యులతో నిర్వహించిన సాధారణ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అవసరాలు ఏమున్నాయి, ఏ ఏ పనులు చేపట్టాలి.. తదితర అంశాలను పంచాయతీ కార్యదర్శి రమాదేవి వివరించారు. అనంతరం పలువురు వార్డు సభ్యులు వారి వార్డుల పరిధిలో నెలకొన్న సమస్యలను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. అనంతరం సర్పంచ్, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులంతా కలిసి పలు తీర్మానాలు చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా, సమర్థవంతంగా చేయాలని, మురుగు కాల్వల్లో పూడిక తీయాలని, ప్రధాన రహదారిపై ఇరు పక్కల గల వ్యాపారుల దుకాణాల వద్దకు వచ్చిన ప్రజలు ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్లు నిలపడంతో సమస్య తలెత్తుతోందని, ఈ సమస్య ఎదురవకుండా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. మరో నెల రోజుల్లో పాలకవర్గ కాలపరిమితి పూర్తవనున్న నేపథ్యంలో గతంలో చేసిన అభివృద్ధి పనులకు చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్త అరుణ, వార్డు సభ్యులు రంజిత్, హనుమంతు, నాగసాగర్, మానస, స్వప్న, నాగరాజు, పెద్ద బోయిన శ్రీను, కనకతార, మల్లమ్మ, కో ఆప్షన్ సభ్యులు కాత యాదగిరి, బోట తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ పరుచుకున్న మంచు



వాజేడు ప్రధాన రహదారిలో..



మంచు కురిసే వేళలో..

వాజేడు: మండలంలో శుక్రవారం ఉదయం పొగ మంచు కమ్ముకుంది. గత కొన్ని రోజులుగా వానలతో అతలాకుతలమైన మండల కేంద్రం వాసులు శుక్రవారం మంచు కురవడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారు జాము నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు కురిసింది. దీంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణించారు.



వాజేడు: నాగారంలో కురుస్తున్న మంచు

ఆశలన్నీ 6 గ్యారంటీలపైనే...

- కొలువు దీరిన కొత్త ప్రభుత్వం.. హామీల అమలుపై ఆశలు...
- ఆరు గ్యారంటీల్లో నేటినుంచి రెండు అమలు
- అసెంబ్లీనుంచే ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం
- రైతు భరోసా అమలైతే కౌలు రైతుల కళ్లల్లో ఆనందం..
- ఉమ్మడి వరంగల్‌లో లబ్ధి పొందనున్న పలువురు

సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరింది. పదవీ ప్రమాణ స్వీకార ఘట్టం ముగిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 'ఆరు గ్యారంటీల అమలు'చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ఆ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాల అమలు దస్త్రంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి సంతకం కూడా చేశారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అందులో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా శనివారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ వైద్యపరీక్షల పరిమితిని రూ.10 లక్షలకు పెంచే హామీలకు శ్రీకారం చుట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ పథకం కింద సుమారు ఎంతమంది లబ్ధిపొందే అవకాశం ఉంది. ఇప్పుడున్న లబ్ధిదారులు ఎంతమంది.. వీటికి అయ్యే వ్యయం ఎంత? ఈ అంశాలను చూద్దాం.

రూ.4 వేలకు పెరగనున్న పింఛను....

నెలవారీ పింఛన్ రూ.4 వేలు, పేదలకు రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు 'చేయూత'పథకాన్ని రూపొందించారు. ఇప్పటికే ఆసరా పథకం ద్వారా ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 4,61,988 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత, నేత, బీడీ కార్మికులు, హెచ్ఐవీ తదితర బాధితులు ఆసరా లబ్ధిదారులుగా ఉన్నారు. ఇందులో 1,62,557 మంది వృద్ధాప్య పింఛన్ పొందుతున్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రతినెలా ఒక్కొక్కరికీ రూ.2,016ల చొప్పున నెలకు రూ.32.77 కోట్లు, ఏడాదికి రూ.393.26 కోట్లు చెల్లిస్తుంది. రూ.4 వేలు అమలు చేస్తే నెలకు రూ.65.54 కోట్లు, ఏడాదికి రూ.786.52 కోట్లకు వ్యయం పెరగనుంది. ఇది కాకుండా రూ.10 లక్షల బీమా కోసం బీమా సంస్థలకు రూ.కోట్లలో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.



నేటినుంచే ఉచిత ప్రయాణం...

ఆరు గ్యారంటీల్లో మొదటిది 'మహాలక్ష్మి'పథకం. ఇందులో మహిళలకు ప్రతినెలా రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. ఉమ్మడి వరంగల్‌లో 27,89,336 మంది ఓటర్లుంటే, అందులో 14,03,860 మహిళలు ఉన్నారు. వారందరికీ శనివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. కాగా మహాలక్ష్మి కింద అర్హులైన వారు 8,56,989 మంది వరకు ఉండవచ్చని అంచనా కాగా.. వీరికి నెలకు రూ.2,500ల చొప్పున ఇస్తే రూ.214 కోట్ల వరకు అవసరం అవుతాయి. ఉమ్మడి జిల్లాలో డబుల్, సింగిల్, దీపం తదితరాల కింద 9.12 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సగటున నెలకు ఓ సిలిండర్ అవసరమైనా.. కొత్త పథకంలో రూ.49 కోట్లు కావాల్సి వస్తుంది.

రైతులు, కూలీలకు ఆసరా...

బీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతులకు రైతుబంధు ప్రయోజనం కలిగించలేదు. ఈసారి రైతులకు, కౌలుదారులకు 'రైతు భరోసా'పేరిట కొత్త ప్రభుత్వం సాయమందించనుంది. ఏటా ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు చొప్పున సాయం అందించనున్నారు. వరిపంటకు బోనస్‌గా రూ.500 ఇవ్వనున్నారు. దీనివల్ల ఉమ్మడి జిల్లా పరిధిలో చాలామంది రైతులకు ప్రయోజనం చేకూరనున్నది. వ్యవసాయం చేసేవారిలో రైతులతో పాటు కౌలురైతులు ఉన్నారు. ఉమ్మడి వరంగల్‌లో 78 వేల మంది కౌలు రైతులుండగా, ఏటా సుమారు రూ.117 కోట్లు కౌలు రైతులకు, రూ.302 కోట్ల మేరకు వ్యవసాయ కూలీలకు అందనున్నాయి.

యువ వికాసం భరోసానివ్వాలి..

యువవికాసం కింద కళాశాల విద్య పూర్తి చేసిన విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, అలాగే ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని హామీలో పేర్కొన్నారు. ఏ కేటగిరీ విద్యార్థులకు దీన్ని వర్తింపజేస్తారు. భరోసాకార్డు ద్వారా ఇచ్చే డబ్బులను ఏ ప్రాతిపదికన జమచేస్తారనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఉమ్మడి వరంగల్‌లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు మూడు లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగవచ్చని అధికారులు చెబుతున్నారు.

గృహజ్యోతిలో 3.13లక్షల కుటుంబాలకు..

గృహజ్యోతి కింద ఉమ్మడి వరంగల్‌లో సుమారు 3,12,901 కుటుంబాలకు మేలు జరగనుంది. ప్రతీ ఇంటికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు ఎన్నో కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. పెరిగిన కరెంటు చార్జీలనుంచి ఉపశమనం కల్పించేందుకు ఇది దోహదపడుతుందన్న ఆశతో ఉన్నారు. మొత్తం 7,92,790 గృహోపయోగ కనెక్షన్లుండగా, ఇందులో దాదాపు 90 శాతం కనెక్షన్లు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించేవారుంటారు. గృహజ్యోతి ద్వారా దాదాపు 3.13 లక్షలకు పైగా కుటుంబాలు ఉచిత విద్యుత్తు పథకంలో లబ్ధి పొందనున్నాయి.

ఇందిరమ్మ ఇల్లు..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీ పథకాల్లో 'ఇందిరమ్మ గృహ నిర్మాణం' ఒకటి కాగా ఆ పథకంలో లబ్ధిదారులకు ఇల్లు లేనివారికి ఇంటి స్థలం. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు. తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటిస్థలం ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇల్లులేని పేదల వివరాలు 2,13,098 మంది ఉంటారని ప్రాథమిక అంచనా. వీరందరికీ దశల వారీగా ఇంటిస్థలం, ఇల్లు కోసం వెయ్యికోట్ల రూపాయలకు పైగా అవసరం ఉంటాయి.

ఐఎన్‌టీయూసీలో చేరిక



భూపాలపల్లి అర్బన్: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) నుంచి పలువురు నాయకులు శుక్రవారం ఐఎన్‌టీయూసీలో చేరినట్లు సంఘం బ్రాంచీ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ గోదావరిఖనిలో యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రత్నం సమ్మిరెడ్డి, భరత్‌కుమార్, రాజశేఖర్, వసంతరావ్, శివకుమార్, సందీప్‌సింగ్‌ఠాకుర్, శ్రీనివాస్‌లతో పాటు మరో 20 మంది కార్మికులు యూనియన్‌లో చేరారు.

రేపు పోటీ పరీక్ష

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో సిబ్బంది నియామకాలకు ఈ నెల 10న పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైపిస్ట్, కాపీయిస్టు పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హైకోర్టు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. గత నెలలో నిర్వహించిన ఈ పరీక్షను సాంకేతిక కారణాలతో హైకోర్టు రద్దు చేసినట్లు తెలిపారు.

ఏఐటీయూసీ గెలుపుతోనే మార్పు



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రమేష్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా మార్పు కావాలంటే రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని యూనియన్ బ్రాంచీ కార్యదర్శి మోటపలుకుల రమేష్ కోరారు. శుక్రవారం ఏరియాలోని కేటీకే 1వ గనిలో గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. గతంలో ఎన్నికైన టీబీజీకేఎస్ గుర్తింపు సంఘం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. కార్మికుల పక్షాన నిలబడి ప్రశ్నించే ఏకైక సంఘం ఏఐటీయూసీ అన్నారు. సింగరేణిలో నూతన గనులు రావాలని, రాజకీయ జోక్యం పూర్తిగా తగ్గిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మాతంగి రామచందర్, శ్రీనివాస్, విజేందర్, చంద్రమౌళి, రామచందర్, రవికుమార్, రాజు మహమ్మద్, నారాయణ, ఫిట్ కమిటీ, సేఫ్టీ కమిటీ, టెంపుల్ కమిటీ, మైన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు



మాట్లాడుతున్న జిల్లా క్వాలిటీ మేనేజర్ భాను

టేకుమట్ల: ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా క్వాలిటీ మేనేజర్లు భాను, చిరంజీవి అన్నారు. మండలంలోని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్‌క్వాస్‌కు ఎంపికైన సందర్భంగా శుక్రవారం వైద్యాధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో జిల్లా క్వాలిటీ టీం ఆస్పత్రిని సందర్శించింది. ఆస్పత్రిలో నాణ్యత ప్రమాణాలు, పాటించాల్సిన నియమాలపై శిక్షణ, అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని చెప్పారు. అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు అందించాలని తెలిపారు. ఓపీ, ల్యాబ్, మందుల వివరాలతో పాటు, హాజరు రికార్డులను క్రమంగా వినియోగించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో చెత్తా చెదారంతో పాటు వ్యర్థాలు ఉండకుండా నిరంతరం పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాష్యనాయక్, మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కురవి: ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మానుకోట జిల్లా కురవి శివారులోని లింగ్యాతండా జీపీలో శుక్రవారం చోటుచేసుకుంది. లింగ్యాతండాకు చెందిన డప్పు రఘు కుటుంబకలహాల కారణంగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయతానికి పాల్పడ్డాడు. తండావాసులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ ఈఎంటీ వెంకన్న, పైలట్ వీరన్నలు.. రఘును అంబులెన్స్‌లో మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అయితే రఘు వారం రోజుల క్రితమే పురుగుల మందు తాగి చికిత్స పొంది రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చినట్లు తండావాసులు తెలిపారు. ఈలోగానే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో స్థానికులు విస్మయానికి గురయ్యారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలో డిగ్రీ బిఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ తదితర కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ల పరీక్షలకు ఫీజు చెల్లించే గడువును అపరాధ రుసుం లేకుండా ఈనెల 11వ తేదీవరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ / హన్మకొండ అర్బన్: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 8, 9వ తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహించబోతున్నారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను కాకతీయ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. రోల్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్ ప్రమోటింగ్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు జాతీయ స్థాయిలోని వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను పంపాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కామర్స్ విభాగం అధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ రజిత, కో కన్వీనర్లు డాక్టర్ సీహెచ్.భాస్కర్, శిరీష, కంప్యూటర్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు.. జాగ్రత్తలు

- ఉద్యానశాఖ అధికారి సూచనలు, సలహాలు





రమేశ్, ఉద్యానశాఖ అధికారి

చెన్నారావుపేట: పంటలు పండించడమే కాకుండా వాటిని నిత్యం పరిశీలిస్తూ.. తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నిర్లక్ష్యంగా ఉంటే క్రిమికీటకాలు, తెగుళ్లు పంటలను నాశనం చేస్తాయి. ఈనేపథ్యంలో ప్రతి నెలా ఉద్యాన పంటలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. ఉద్యానపంటలో డిసెంబర్ నెలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై ఉద్యాశాఖ అధికారి దయ్యాల రమేష్ సూచనలు..

బొప్పాయి:
మొక్కలు నాటే 15 రోజుల ముందు మొక్కకు మొక్కకు 40 సెంటి మీటర్ల వెడల్పు, పొడవు దూరంలో గుంతలు తీయాలి. గుంతలపై మట్టికి 5కిలోల పశువుల ఎరువు కిలో వేపపిండి 20 గ్రా. అజోస్పైరిల్లం 20 గ్రా. పాస్ఫో బ్యాక్టీరియా వేసి బాగా కలిపి గుంత నింపాలి. 45–60 రోజుల వయస్సున్న 10సెం.మీ పొడవున్న మొక్కలని గుంతలో సాయంత్రం సమయంలో నాటుకోవాలి. తోట చుట్టూ మొక్కలు నాటడానికి 15 రోజుల ముందే రెండు వరుసల అవిశ, ఆముదం, మొక్కజొన్నను ఆకర్షక పంటలుగా వేసుకోవాలి. దీంతో వైరస్ తెగుళ్ల వ్యాప్తిని తగ్గించవచ్చు. తెల్లదోమ నుంచి మొక్కలను కాపాడుకునేందుకు ఎకరాకు 12–15 పసుపు రంగు అట్టలను తోటలో అమర్చాలి. నివారణకు వేపనూనె 2.5 మి. లీ లను అసిఫేట్ 2.5గ్రాను జిగురు 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. డ్రిప్ పద్ధతిలో చిన్న మొక్కలను 2రోజులకు ఒక్కో మొక్కకి 8 లీటర్లు, పెద్ద మొక్కలకు రోజుకు 20–25 లీటర్ల నీటిని పెట్టాలి.

సపోట:
కాయలు ఎదిగే దశలో ఉన్నపుడు కాయ తొలుచు పురుగు ఆశించకుండా వేప గింజల కషాయం 5 శాతం లేదా వేప నూనె(0.15శాతం) 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నప్పుడు మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా ప్రొఫెనోపాస్ 2.మి.లీ లీటరు నీటికి కలిపి చిగుర్ల దశలో పురుగు మందులను పిచికారీ చేయాలి. ఆకు జల్లెడ గూడు పురుగు తీవ్రత తగ్గించుకోవడానికి 2.6 ఎంఎల్ క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలి.



పూతతో మామిడి చెట్టు

మామిడి:
మామిడి పూ మొగ్గలను ఉత్తేజ పరిచి త్వరగా పూత రావడానికి, ఆడపూల శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ 10గ్రా. బోరాన్ 2 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూ మొగ్గ దశలో తేనే మంచు పురుగు నివారణకు లీటరు నీటికి మొదటి దశలో క్లోరోపైరిపాస్ 2.5మి.లీ కలిపి పూత మొదలయ్యే సమయం, పిందెలు తయారయ్యే సమయంలో ఆకుల పైన కాకుండా మొదళ్ల పైన కొమ్మలపైన కూడా పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగులను అదుపు చేయడానికి మొగ్గ సమయంలో లీటరు నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

పసుపు:
ఆఖరి దఫా ఎరువులు ఈ మాసం మొదటి పక్షం లోపల వేయాలి. దుంపకుళ్లు ఆశిస్తే 3 గ్రాములు మెటలాక్సిల్ లేదా 3 గ్రా. మంకోజెబ్‌ను మోనోక్రోటోఫాస్ 2మి. లీటరు నీటికి కలిపిన మందు ద్రావణాన్ని మొక్క పాదుల దగ్గర నేల తడిచేలా పోయాలి. దుంపకుళ్లు ఆశించినప్పుడు నీటి తడుల మధ్య వ్యవధి పెంచాలి.



అరటి తోట

అరటి:
అరటి తోటల్లో కలుపు లేకుండా శుభ్రంగా ఉంచి తల్లి చెట్టు చుట్టూ వచ్చే పిలకలను ఎప్పటికప్పుడు కోసి వేయాలి. అలాగే అవసరాన్ని బట్టి నీటి తడి ఇవ్వాలి. నులి పురుగులు ఆశిస్తే మొక్కకు 25–40 గ్రా. కార్బోఫ్యూరాను గుళికలు మొక్క మొదలు దగ్గర 10 సెం.మీ లోతులో వేసి మట్టితో కప్పి తేలిక పాటి తడి ఇవ్వాలి. తెల్ల చక్కరకేళి రకానికి నాలుగో దఫా ఎరువులు వేయాలి.

మల్లె:
మల్లె తోటలో ఆకులను దూసి, ఎరువులను వేసి నీటి తడులను ఇవ్వాలి. ప్రతి మొక్కకు 8–10 పశువుల ఎరువతో పాటు 90 గ్రా. నత్రజని 120 గ్రా. భాస్వరం, పొటాష్ ఎరువులను కొమ్మ కత్తిరింపులు చేసిన వెంటనే ఇవ్వడం ద్వారా పూలు త్వరగా వచ్చే అవకాశముంది.

ధనియాలు:
ధనియాలు విత్తిన తర్వాత రెండోసారి కలుపు తీసి, తేలికపాటి తడినివ్వాలి. బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి 1గ్రా. కార్బండాజిమ్ లేదా గంధకం 3 గ్రా. లేదా కెరాథేన్ 1మి.లీ కలిపి పిచికారీ చేయాలి. ఈ సూచనలు పాటిస్తే తెగుళ్లను నివారించుకొని అధిక దిగుబడులు పొందవచ్చని. అవసరం మేరకు ఉద్యానశాఖ అధికారుల సూచనలు తీసుకోవాలని సూచించారు.

క్యాబేజీ, కాలీఫ్లవర్
పంటలను ఆశించే డైమండ్ బ్యాక్ మాత్ నివారణకు వారానికి ఒకసారి చొప్పున ఎన్.పీ.వీ వైరస్ ద్రావణం (250 లార్వల్ ఇక్వివాలెంట్ 200 లీటర్ల నీటికి కలిపి) నాలుగు సార్లు పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు రైమాన్ 1మి.లీ లీటరు నీటికి కలిపి కోతకు 15 రోజుల వ్యవధి ఉండేలా పిచికారీ చేయాలి. అవాల పంటను ఆకర్షణ పంటగా క్యాబేజీ, కాలీఫ్లవర్ పంటల్లో వేసుకోవాలి.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కేయూ రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కేయూ అధ్యక్షుడు ఆచార్య ఈసం నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావును కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 86 మంది ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలన్నారు. మరణించిన రెగ్యులర్, దినసరి వేతన, లంప్సమ్ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ఆరేళ్లగా తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలను పెంపుదల చేయలేదన్నారు. ఉద్యోగుల కోరిక మేరకు బదిలీలు చేపట్టాలన్నారు. పరీక్షల విభాగం, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అదనపు పనికి అదనపు వేతనం చెల్లించాలన్నారు. దూరవిద్యాకేంద్రం ఉద్యోగి డాక్టర్ సంగాల ఎఫ్రిమ్ రాజుకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. అర్హులైన నాల్గవ తరగతి ఉద్యోగులు బొక్క మొగిలి, భరత్, సుమన్, రవి, మహేందర్, రాజన్న, నాగరాజు, ప్రవీణ్‌లకు టేబుల్ వర్క్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా పెండింగ్ సమస్యలను పరిష్కరించకుంటే జనవరి 2నుంచి సమ్మె చేస్తామని తెలిపారు. రిజిస్ట్రార్‌ను కలిసినవారిలో దామెర ప్రకాశ్, నమిండ్ల కిరణ్‌కుమార్, గాదె సుమన్, మొగిలి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న ఉద్యోగ సంఘం బాధ్యులు

ప్రసూతి ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- శానిటేషన్ స్టోర్స్‌లో మెటీరియల్ దగ్ధం
- ఘటనపై స్పష్టత ఇవ్వని సూపరింటెండెంట్

హన్మకొండ: హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదాన్ని ముందే పసిగట్టిన సిబ్బంది ఆస్పత్రి అధికారులు, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. దీంతో పెద్దగా ఆస్తి నష్టం జరగలేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ సారంగం తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్పత్రి ఆవరణలో చివర్లో ఉన్న ఓ భవనంలో మొదటి అంతస్థులోని ఓ గదిలో ఆస్పత్రిని శుభ్రపరిచేందుకు వినియోగించే బ్లీచింగ్, యాసిడ్, పినాయిల్, చీపుర్లు, బకెట్ల ఇతర సామగ్రి భద్రపరిచేందుకు స్టోర్ రూంగా వాడుతున్నారు. రోజు మాదిరిగానే ఆస్పత్రి శానిటేషన్ కార్మికుడు యాసిడ్, చీపుర్లు తీసుకునేందుకు స్టోర్ రూంకు వెళ్లాడు. కార్మికుడికి కావాల్సిన వస్తువులను తీసుకుని తాళం వేస్తున్న సమయంలో గదిలో నుంచి ఒక్కసారిగా పేలిన శబ్దం వినిపించింది. దీంతో తలుపులు తెరిచి చూసిన కార్మికుడికి దట్టమైన పొగలు కనిపించడంతో వెంటనే శానిటేషన్ సూపర్‌వైజర్, అధికారులకు సమాచారం తెలియజేశాడు. బకెట్ల సాయంతో నీటిని తోడి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తూనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో దాదాపు రూ.రెండు లక్షలపై చిలుకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. అయితే ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రాథమిక నిర్ధారణకు రాగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాత్రం శానిటేషన్ స్టోర్ రూంకు అసలు విద్యుత్ సరఫరా లేదని, అగ్నిప్రమాదంపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. సంఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మేధోసంపత్తి.. నిరంతర ప్రక్రియ

- కేయూ వీసీ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్: మేధోసంపత్తి అనేది నిరంతర, అనంత ప్రక్రియ అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు, శుక్రవారం విశ్వవిద్యాలయం ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెల్ ఆధ్వర్యంలో సంచాలకులు ఆచార్య ప్రసాద్ అధ్యక్షతన, విశ్వవిద్యాలయ పరిపాలనాభవనం సెనెట్ హాల్‌లో నిర్వహించిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్) అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యక్తి మేధోవికాసం సృజనతో కూడుకుంటుందన్నారు. దీనికి అంతం, పరిమితం ఉండదని తెలిపారు. పరిశోధనల ఫలితాలు సామాన్య ప్రజానికానికి అందాల్సిన అవసరం ఉందన్నారు. పరివర్తన, అభివృద్ధి వేర్వేరు అన్నారు. ఈ కార్యక్రమంలో టీ.ఎస్.కాస్ట్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ వి.రాధిక రెడ్డి, ఐ.పీ.ఆర్ డైరెక్టర్ అశోక్ దొప్పలపూడి మేథోసంపత్తి హక్కులపై వస్తున్న మార్పులు, అవకాశాలు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేశ్

స్పాన్సర్ కోటాకు నోటిఫికేషన్

- 16న పలు పీజీ కోర్సులకు కౌన్సెలింగ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం (2023–2024)లో క్యాంపస్ కళాశాలలో ఎంఎల్ఐఎస్‌సీ, ఎమ్మెస్సీ బాటనీ, ఐదేళ్ల ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ కోర్సుల్లో స్పాన్సర్ కోటా సీట్లలో భర్తీకి శుక్రవారం యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌లాల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆసక్తిగల సీపీ గెట్ 2023లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 16వ తేదీన ఉదయం 11గంటలకు క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరుకావాలని తెలిపారు. ఒరిజనల్ విద్యార్థతల తదితర ఒరిజనల్ సర్టిఫికెట్లతో రావాలని, జనరల్ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులకు రూ.150 ప్రాసెసింగ్ ఫీజు ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజుతోసహా హాజరుకావాలని సూచించారు. ఈ స్పాన్సర్ కోటా ద్వారా అడ్మిషన్లు పొందే విద్యార్థులకు హాస్టల్‌వసతి ఉండదని, అలాగే స్కాలర్ షిప్‌లకు అనర్హులని, యూనివర్సిటీ విధించిన ఫీజును కూడా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లో చోరీ

- 16గ్రాముల బంగారం, రెండు గ్రాముల వెండి అపహరణ

శాయంపేట : మండలంలోని మాందారిపేట గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మ పోచమ్మ ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాందారిపేటలో ఇటీవల గౌడ కులస్తులు తమ ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించుకున్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి గేటు తాళం పగులగొట్టి ఎల్లమ్మ తల్లి విగ్రహానికి ఉన్న జత బంగారం కమ్మలు, రెండు బంగారు పుస్తెలు, రెండు గ్రాముల వెండి మట్టెలు దొంగిలించినట్లు తెలిపారు. అదే గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహానికి ఉన్న జత బంగారు కమ్మలు, బంగారు ముక్కుపుడక, బంగారు బొట్టు బిళ్ల అపహరించినట్లు తెలిపారు. రెండు విగ్రహాలకు కలిపి మొత్తంగా 16 గ్రాముల బంగారం, రెండు గ్రాముల వెండి దొంగలించినట్లు వెల్లడించారు. వీటి విలువ రూ.80వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎల్లమ్మ తల్లి గుడిలో దీపం పెట్టడానికి గాజర్ల సదానందం వెల్లగా గుడి తాళం పగలగొట్టి ఉండడంతో గౌడ కుల సంఘం సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు పరిశీలించి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

మా బాబును కాపాడండి

- తక్కువ బరువుతో శిశువు జననం
- వెంటిలేషన్‌పై చికిత్స
- రోజుకు సుమారు రూ.40వేల ఖర్చు
- ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

బచ్చన్నపేట: కుమారుడు జన్మించాడని సంబురపడిన తల్లిదండ్రులకు ఆ ఆనందం ఎక్కువసేపు లేదు. తమకు పుట్టిన బాబు కేవలం 1.8కేజీల బరువు మాత్రమే ఉన్నాడని, చికిత్స తప్పదని, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో షాక్‌కు గురయ్యారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామానికి చెందిన మనోహర్, నందిని దంపతులకు డిసెంబర్ 1వ తేదీన సంగారెడ్డిలోని శిశు రక్ష ఆస్పత్రిలో తక్కువ బరువుతో కుమారుడు జన్మించాడు. బరువు తక్కువతోపాటు, ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని రోజుకు రూ.40వేల వరకు ఖర్చు అవుతుందని తెల్సి గుండెపగిలేలా రోదిస్తూ.. ఆపన్న హస్తం కోసం వేడుకుంటున్నారు. మనోహర్ వృత్తి రీత్యా పెయింటర్ కాగా.. ఎలాంటి ఆస్తులు లేవు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టం రావడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో కూడా పాప జన్మించి ఇలాంటి అనారోగ్య ఇబ్బందితోనే మృతి చెందిందని ప్రస్తుతం బాబును ఎలాగైనా కాపాడాలని వేడుకుంటున్నారు. దాతలు ఆస్పత్రి నంబర్ 73311 01888 ద్వారా సంప్రదించి, పరిస్థితి తెలుసుకోవచ్చని తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబు

ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు
93814 77012, 84988 75228

డాక్టర్ అనిరుధ్ దేశ్‌పాండేకు అవార్డు

ఎంజీఎం : హనుమకొండ నగరానికి చెందిన వినాయక మల్టీ స్పెషాలిటీ సెంటర్ వైద్యుడు, ప్రముఖ న్యూరో ఫిజిషియన్ అనిరుధ్ దేశ్ పాండే అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. కెనడా రాజధాని ఒట్టవాలోని సివిక్ ఆస్పత్రిలో పరిశోధన చేసినందుకు గాను 2014లోనే ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ ఒట్టవా నుంచి బ్రెయిన్ స్ట్రోక్ న్యూరాలాజీలో ఫెలోషిప్ పూర్తిచేసిన ఏకైక న్యూరాలజిస్టుగా డాక్టర్ అనిరుధ్ అవార్డు అందుకున్నారు. దీంతోపాటు, ఇటీవల యూకేలోని రెండు ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్‌లో ఫెలోషిప్ రాయల్ కాలేజీ ఆఫ్ ఫిజిషియన్స్ లండన్, యునైటెడ్ కింగ్‌డమ్, రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్ ఎడిషనర్స్ స్కాట్లాండ్, దేశాల ద్వారా గౌరవప్రదమైన ప్రతిష్టాత్మకమైన అవార్డులను అందుకున్నారు. వరంగల్, హనుమకొండకు చెందిన న్యూరోఫిజిషియన్‌లలో ఇలాంటి అవార్డులు దక్కడం ఇదే తొలిసారి అని ఆయన తెలిపారు. టర్కీ, డెన్మార్క్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సమావేశాల్లో కూడా తన పరిశోధన పత్రాలు సమర్పించి 40 కంటే ఎక్కువ పరిశోధన ప్రచురణలను అందజేసి అనేక అంతర్జాతీయ పత్రికల సంపాదకీయ బోర్డులో సభ్యులుగా ఉన్నట్లు పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న అనిరుధ్ దేశ్‌పాండే

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల అక్రమాలపై నిఘా?

- వారి భూవ్యవహారాలపై చిట్టా సిద్ధం చేస్తున్న ఇంటెలిజెన్స్
- పోలీసుల కదలికలతో గులాబీ నేతల్లో గుబులు

సాక్షి, వరంగల్ : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల అక్రమాలపై నివేదిక పంపించాలని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఇంటెలిజెన్స్ విభాగం రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లోని జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తమ భూములను కబ్జా చేశారని పలువురు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత ఉన్నతాధికారులకు ఇచ్చిన ఆదేశాలతో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని ఇంటెలిజెన్స్ విభాగం ఓ నివేదికను రూపొందించి పంపించేందుకు సిద్ధమమైందని సమాచారం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో వారు చేసిన భూకబ్జాలపైనే వచ్చిన ఫిర్యాదులతో కూడిన పూర్తి వివరాలను పోలీసు ఉన్నతాధికారులకు అందించనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఆ నోటా ఈనోటా ఈ విషయం బయటకు రావడంతో ఒక్కసారి గులాబీ శ్రేణుల్లో అలజడి నెలకొంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమాలు తమ మెడకు ఎక్కడా చుట్టుకుంటాయోనని ముఖ్య నేతలు అంతర్మథనంలో పడినట్లు సమాచారం. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఇది చేస్తున్నట్లు, ప్రజల ముందు ఉంచే ప్రయత్నం ఆ నేతలు చేసే అవకాశం ఉందని గులాబీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడు ఇవి సాధారణమని, ఉద్యమ సమయంలో ఇంతకు మించి ఎక్కువ చూశామని, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆ నేతలు చెబుతున్నట్లు గులాబీ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

అన్యాయంగా రూ.6కోట్ల ఆస్తి కబ్జా

- ప్రజా దర్బార్‌లో సీఎంకు ఓ ఉపాధ్యాయుడి ఫిర్యాదు

పరకాల: అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆస్తి విషయంలో తమకు అన్యాయం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ఓ ఉపాధ్యాయుడు ఆయన భార్య ఫిర్యాదు చేశారు. తాను పాఠశాలలో ఉన్న సమయంలో బలవంతంగా కిడ్నాప్ చేసి రూ.100 స్టాంప్ కాగితాలపై తనతో సంతకాలు చేయించుకొని తనకు రావాల్సిన రూ.6కోట్ల విలువైన ఆస్తులను కబ్జాలో భాగస్వాములయ్యారని ఉపాధ్యాయుడు చిట్టిరెడ్డి నర్సింహారెడ్డి దంపతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గతంలో తాము ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే కలెక్టర్ తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పరకాలలో అవినీతి బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.



ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసిన నర్సింహారెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి




కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరీమాబాద్ : మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు మాట్లాడారు. జిల్లా రైతులు 1.50 లక్షల ఎకరాలకు పైగా పంటలు నష్టపోయారని పేర్కొన్నారు. గత మార్చి, ఏప్రిల్‌లో కూడా తుపానుతో పంటలు నష్టపోయారని, అప్పటి ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికే పరిహారం అందించిందని గుర్తుచేశారు. అనంతరం ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా అప్పారావు, అశోక్, కృష్ణ, హరిబాబు, అక్బర్, అమర్, వీరయ్య ఉన్నారు.

బోధనోపకరణాల పంపిణీ

కాశీబుగ్గ/కాజీపేట: ఎస్ఐఈపీఐడీ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఎస్సీ, ఎస్టీ మానసిక దివ్యాంగ విద్యార్థులకు ఉచిత బోధనోపకరణాలను డీఈఓ కార్యాలయంలో అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. వరంగల్ జిల్లాకు చెందిన 31 మంది, హనుమకొండ జిల్లాకు చెందిన 15 మంది, మహబూబాబాద్ జిల్లాకు చెందిన నలుగురు దివ్యాంగ విద్యార్థులకు అందజేశారు. ఎస్ఐఈపీఐడీ బాధ్యులు డాక్టర్ గౌసియాఫరీష్, డాక్టర్ ఉష తదితరులు కిట్–2, కిట్–3, కిట్–4కు సంబంధించిన బోధనోపకరణాల వినియోగంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ఐఈ కోఆర్డినేటర్ కుడికాల సుభాష్, బి.రాధ పాల్గొన్నారు.



బోధనోపకరణాలను అందజేస్తున్న అధికారులు